# సంఘసేవ మహావేశానం!

"పార్వతీ నీకో ఉత్తరం ఉందోయ్ చింపనా!" హాల్లోంచి లోపలికివస్తూ అన్నాడు కృష్ణమూర్తి!

"ఒకళ్ళ ఉత్తరానికి సమాధానం రాయలేదు కదా నాకింకా ఎవరు ఉత్తరం రాశారు చెప్మా ఇప్పి చదివిపెట్టు" అంటూ స్టౌమీది గిన్నెలో గరిట తిప్పడం ప్రారంభించింది పార్వతి. ఉత్తరం చింపి ఉత్సాహంతో చదివి ఈలవేశాడు, కృష్ణమూర్తి.

"ఎవరో చదవరేం?" కసురుకొంది పార్వతి.

"నీ ఫ్రెండు ఉమ ఇంకెవరికుంటుంది, నీ మీద అంత ప్రేమ-ఒక్క నాకు తప్ప." అంటూ నాటక ఫక్కీలో ఉత్తర పఠనం సాగించాడు కృష్ణమూర్తి ఆ ఉత్తరం సారాంశం అంతా - ఒక్కటే సంగతి — ఇన్నాళ్ళకి పార్వతికి తగిన మనిమనిషిని చూడకల్గినందుకు ఉమ పడుతున్న సంతోషం ఇరవై రెండు ఇరవై మూడేళ్ళుంటాయట. నల్లగా ఉన్నా శుభ్రంగా ఉందట. దిక్కూ మొక్కూ లేదట అందుకే శాశ్వతంగా పార్వతితో ఉండిపోయేలా మాట్లాడి పంపిస్తుందట.

ఉత్తరం విని పార్వతి స్టౌ తగ్గించేసింది. ఆనందం రెక్కలు విప్పిందామె హృదయంలో పాదా లమాంతం నేల మీాద నిలవనంటున్నాయి. అంత ఆనందానికి చిహ్నంగా కృష్ణమూర్తి కంఠానికి చేతులు పెనవేసి చిన్నముద్దు పెట్టుకుంది. "ఇంక నాకెంత హాయి! మనిద్దరం పెళ్ళయిన కొత్తలోలాగ హాయిగా తిరగవచ్చు. నానిగాణ్ని, బాబిగాణ్ణి చక్కగా చూసుకుంటుంది. వాళ్ళ బెంగ ఉండదునాకు" అంటూ ఏమేమిటో మాట్లాడుతున్న పార్వతిని పక్కకునెట్టి మాడువాసన వస్తున్న గిన్నెని స్టౌ మీాదనుంచి కింద పెట్టాడు కృష్ణమూర్తి.

"ఇంక రెండు రోజులేగా యీా బెడద? హాయిగా ఆ పిల్ల వచ్చిందంటే" అంటుంది పార్వతి.

"నా మాట కొంచెం వినిపించుకోవోయ్." అంటూ ఆపాడు కృష్ణమూర్తి.

"మిా మగవాళ్ళింతే. ఇంత ఆనందకరమైన వార్త యీా మధ్యకాలంలో ఏదైనా విన్నానా? పాపం ఉష ఎన్నాళ్ళనుంచి ప్రయత్నిస్తోందో. మొన్నటికి మొన్నా వచ్చినప్పుడు నే పడుతున్నా అవస్థచూసి కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది దానికి."

"అది సరే. పెరట్లో ఆ విడిగా ఉన్న గది నివాస యోగ్యం చేయించు. దాన్లో ఉండమను...తొలి దగ్గరనుంచి నెత్తి ఎక్కించుకోక...అంటూండాగానే కృష్ణమూర్తి మాట మధ్యలో ఆపేసింది పార్వతి.

"నీ పిచ్చిగాని ఉమకి నచ్చిందంటే దాన్ని నెత్తిన పెట్టుకోవలసిందే నన్నమాట." అంటూ ఆపేసిన పని పూర్తి చేయడానికి ఉపక్రమించింది పార్వతి.

సాయంత్రం పేపరు చూసుకుంటూ కొడుకులకి కబుర్లు చెప్తూ కొత్త పనిమనిషి వస్తుందని చెప్పాడు కృష్ణమూర్తి.

"ఎలా ఉంటుంది నాన్నారూ! అమ్మలాగా ఉంటుందా?" దానికి సమాధానం చెప్పేలోగానే నానిగాడు తన నిర్ణయం చెప్పేశాడు.

"అయితే వద్దు" అన్నాడు.

"పని మనిషి ఎలా అమ్మలా ఉంటుందనుకున్నావురా బాబిగా!" నవ్వుతూ కొడుకుని ఒళ్ళోకి ఎక్కించుకున్నాడు కృష్ణమూర్తి. "అమ్మలాఉంటే వద్దంటావేంరా వెధవాయి" అంటూ వంగి నానిగాడి తల తట్టాడు.

"అవును నాన్నారూ. అమ్మ అన్నింటికీ కసురుతుంది. మీరు కొడ్పడతారనిగానీ లేకపోతేనా" అంటూ ఏడుస్న కళ్ళ నానిగాడూ చొక్కా చేతులు పైకి తోసుకున్నాడు. వాడికి నెల్లూరి కాంతారావు గురువు!

"నువ్వు అల్లరిచేస్తే ఏం చేస్తుంది మరి! అమ్మకి సరదాగా ఉండడానికి వ్యవధి చిక్కాలంటే ఓ పనిమనిషి కావాలి. "పనిమనిషి అవసరం విజ్ఞాన దాయికంగా వివరించి చెప్పాలని చూశాడు కృష్ణమూర్తి. మొగ కుర్రాళ్ళకి రీజనింగేమిటి?" అంటూ ఏదీ వివరించదు పార్వతి. అందుకే ఆ లోటు తను భర్తీ చేయాలని తలపోస్తాడు కృష్ణమూర్తి.

"పనిమనిషి వస్తేఅమ్మని పంపించేస్తారా?" అంతాచెప్పాక నిల

దీసి అడిగాడు నానిగాడు. మరి అమ్మ చేస్తున్న పనంతా పని మనిషి చేస్తూంటే ఇంకెందుకు అమ్మ అని వాడి ఆలోచన!

"అమ్మ కింకో పాపాయి పుట్టిందనుకో. అప్పుడింకా పని కదా? అందుకే ఈ పనిమనిషి." సులభంగా ఒక కారణం దొరికినందుకు సంతోషించాడు కృష్ణమూర్తి.

"ఇంకో పాపా యెందుకు నాన్నాగారూ! మేం ఉన్నాంగా ?" అమాయకంగా నిలవేశాడు బాబిగాడు. వంటింటి గుమ్మంలో నిలబడి తండ్రి కొడుకుల సంవాదాన్ని విని సన్నగా నవ్వుకుంది పార్వతి.

ఆ మనిషి దిక్కు లేందిరా. మనింట్లో వుంటుంది" అని ఒక్కమాటలో కృష్ణమూర్తి లాజిక్కంతా తోసి రాజంది పార్వతి. కుర్రవెధవల కది అర్థం అయినట్టుంది – అంతేనా అన్నట్టు చూశారు...

రెండురోజులు రెండు యుగాలుగా గడిచాయి. పార్వతికి. తీరా ఆ మనిషి వచ్చుతుందో లేదో అన్న పిరికితనం ఆడపా తడపా తలెత్తినా – అణగ దొక్కింది.

ఆ ఎదురుచూసిన ఎల్లుండి ఉదయం రానే వచ్చింది. తెలతెలవారుతూంది, పాచిపనిచేసే మనిషి వచ్చి తలుపు తట్టి పిలుస్తూంటే లేచింది పార్వతి...ఆ క్షణంలోనే జ్ఞాపకం వచ్చింది. కొత్త పనిమనిషి వచ్చే రోజని. ఆ క్షణంనుంచి నిరీక్షించగా ఎనిమిదిగంటలవేళ ఓ రిక్షా ఆగింది గుమ్మంలో.

పట్టుమని పాతికేళ్ళు నిండని అమ్మాయి చిన్న సూట్ కేస్‌తో రిక్షాదిగింది, నాజూకుగా సన్నంగా వుంది. ఛామన ఛాయిగా ఉన్న కళ్ళు ఆకర్షవంతంగా ఉన్నాయి. గుమ్మం

లోకి వచ్చి నిలబడింది. పార్వతి వీధిగుమ్మంలోకి వచ్చింది. ఇద్దరూ ఓ క్షణం ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు. ఇంతలో చేతిలో ఉన్న సంచీలోంచి ఓ కవరు తీసి అందించింది పార్వతికి. ఉమ ఉత్తరం కూడా ఇచ్చి పంపించింది. "రామ్మా లోపలికి రా." అంటూ లోపలికి దారితీసింది పార్వతి.

హాల్లో కుర్చీలో కూర్చుంది. పక్కనే నిలబడింది ఆ అమ్మాయి.

"నీ పేరేమిటి?" అడిగింది పార్వతి.

"రమణ" నెమ్మదిగా చెప్పిందా అమ్మాయి.

"నువ్వు వస్తావని తెలుసుగా, స్టోర్రూము పక్క మేం వాడని గది వుంది. దాన్లో వుంటూ వుండు. వుగాని పెరట్లో తోటవాడు వీరస్వామి ఉన్నాడు. వాడుకూడా నీకువనిపాటల్లో సాయాంచేస్తూ వుంటాడు. సరేనా?" పరిచయ వాక్యాల్లాగా పలికింది పార్వతి. ఆ ముహూర్తబలం ఎలాంటిదోగాని రమణకీ పార్వతికీ-ఒక్క టేదారి ఏర్పడింది.

పార్వతికి చెప్పడం వంతు.

రమణది చేయడంవంతు.

నానిగాడు, బాబిగాడు అంతా రమణచేతి కీలుబొమ్మలుగా తయారవడానికి నెల్లాళ్ళుకూడా పట్టలేదు.

కృష్ణమూర్తి అడపా తడపా హెచ్చరించినా వినిపించుకొనే స్థితిలో పార్వతి లేదు. "నీకన్నీ అనుమానాలు కృష్ణా రమణ చాలా మంచిది. ఈ కొంప వదిలి ఎక్కడికి పోదు." అంటూ తేల్చి పారేసేది.

సంవత్సరం పూర్తి కాలేదు. ఓ రోజు రమణ ఏడుస్తూ పార్వతి కళ్ళపడింది. ఓగంట బ్రతిమాలింది పార్వతి.

"అమ్మగారూ, నేను చాలా తప్పుచేశానమ్మగారూ" అంటూ భోరున ఏడ్చింది.

ఇంకోగంట బ్రతిమాలిన తరువాత అసలు విషయం తేలింది. రమణ నెల తప్పింది. మూడో నెల దాటిపోతూంది. పార్వతి ముందు బిక్కపోయినా ఊహాలని నిలదొక్కుకుంది. "ఏదో దారి చూద్దాంలే అలా బెంబేలు పడిపోకు" అంటూ ధైర్యం చెప్పింది.

రాత్రి ఏం చేయాలన్నది కృష్ణమూర్తితో చర్చించి తన ప్లాను కతన్ని ఒప్పించేసరికి తెల తెలవారుతూంది! "నీ యిష్టం వచ్చినట్టు అఘోరించు" అని అయిష్టంగానే పర్మి షన్ ఇచ్చాడు కృష్ణమూర్తి.

నెలలు నిండాయి రమణ మగపిల్లాణ్ని కంది. ఇంట్లోనే పని పాటలు చూసుకుంటూ చాలా సౌఖ్యంగా తయారైంది. "చేసిన తప్పుకి పశ్చాత్తాపం కంటే ప్రాయశ్చిత్తం ఏముం టుంది? నే చేసినది మంచిపనే అని" మురిసిపోయింది పార్వతి.

కాని కృష్ణమూర్తికిదేం అంత నచ్చలేదు. తన పిల్లలీ పనిమనిషి పిల్లాడిని ఆడించడం లాంటివి సహించలేక పోతు న్నాడు. ఏదైనా అనాథ శరణాలయానికి పంపేద్దాం అని ఎన్నిసార్లు చెప్పినా, పార్వతికి మనస్సు ఒప్పలేదు. కాని తను

ఎంత గుడ్డిగా పోయిందో-ఒకనాటి మధ్యాహ్నం తెలిసివచ్చింది పార్వతికి. ఆ పూటే రమణ రాల్చింది ఉరమని పిడుగుని!

"అమ్మగారూ, నే వెళ్ళిపోతా నమ్మగారూ" అంది.

తన చెవులను తానే నమ్మలేకపోయింది.

"అవునమ్మగారూ, ఇక్కడ పని ఎక్కువగా ఉంది. నే నింకో ఇల్లు చూసుకున్నాను. సెలవిప్పించండి" అని హెచ్చరించింది రమణ.

"అదేమిటి రమణా, ఇంత చేశాక!" ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

"అదేనమ్మగారూ యీ పిల్లలతో అసలు పనే తెమలకుం లేదు. ఆళ్ళింట ఇద్దరు పెద్దాళ్ళే, రెండక్షరముక్కలు కూడా నేర్పిస్తామన్నారు. తెల్లారి వెళ్ళిపోతాను." అంది రమణ.

పార్వతికి ఆలోచించుకునేందుకు వ్యవధి కావాలి. "అయ్యగారితో చెప్తాను. తొందరపడకు" అని అప్పటికి నిర్ణయం చేసే బాధ్యతనుంచి తప్పించుకుంది.

రమణ తెల్లవారుఝామునే వెళ్ళిపోతా నంటూంది. పెరట్లో వీరాస్వామికూడా తెల్లారి కనబడలేదు. పిల్లాడు మాత్రం పార్వతికి మిగిలిపోయాడు.

"నీ యిష్టంవచ్చినట్టు చేయి పార్వతీ. మొదటే చెప్తే విన్నావా?" విసుక్కున్నాడు కృష్ణమూర్తి. కాలు కాలిన పిల్లిలాగా రెండు రోజులు ఏమీ తోచక తిరిగింది పార్వతి. యీ పిల్లవాన్ని ఏం చెయ్యాలి? అని ఒకటే ఆలోచన.

చివరికి, తెలిసిన ఒక ప్రముఖ సేవా సంస్థకి ఫోన్ చేసింది. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో రకాల రక్షణ కేంద్రాలున్నాయి. పసివాళ్ళకేదో ఒకటి ఉండకపోతుందా అని పార్వతి ధైర్యం. వచ్చే వారంలో మేం ఒక అనాథశరణాలయానికి ప్రారంభోత్సవం జరిపిస్తాం. అప్పటికి కుర్రవాణ్ణి తీసుకు వెళ్ళిపోతాం లెండి...మీ వారూ మీరూ సంతకం చేసి అప్పగిస్తే చాలు. అని ధైర్యం చెప్పిందావిడ.

కొండంత బలం వచ్చింది పార్వతికి.

వారం గడవక ముందే పిల్లవాణ్ణి శరణాలయానికి అప్పగించింది.

ఉమకో ఉత్తరం రాసి పడేసింది–రమణ ఇలా చేసింది అంటూ.

మూడో నాటికల్లా ఉమ జాబురాస్తూ "మళ్ళీ ఇంకో మనిషిని చూసి పంపుతాను. సరేనా!" అంటూ వాపోయింది.

టెలిగ్రాములాగా సమాధానం వ్రాసింది పార్వతి—"వద్దు. నేను సంఘసేవ మానేశాను!" అని.

పార్వతి దడుసుకుందని నవ్వుకున్నాడు కృష్ణమూర్తి. కాని పిల్లాడికో దారి చూడ్డం కోసం కృష్ణమూర్తి వేసిన పథకమే ఇదని యీనాటికీ పార్వతికి తెలియదు!

పార్వతి మంచిది.

కృష్ణమూర్తిమీద గుడ్డినమ్మకం పెంచుకున్నది.